క్లుప్తంగా

అమావాస్య హోమం



ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి తదితరులు

కందుకూరు: మండలంలోని పులిమామిడిలో నిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయం భగవంతుడి సేవలో గడపాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థినికి బంగారు పతకాలు



సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలతో భువనశ్రీ

కందుకూరు: తెలంగాణ స్థాయి కిక్ బాక్సింగ్ సబ్ జూనియర్ పోటీల్లో మండల పరిధిలోని సార్లరావులపల్లి మాజీ సర్పంచ్ రజితప్రవీణ్ నాయక్ కూతురు భువనశ్రీ బంగారు పతకాలను కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్‌లో ఇటీవల ముగిసిన రాష్ట్రస్థాయి గ్రేడ్-4 కిక్ బాక్సింగ్ పోటీల్లో రెండు బంగారు, ఒక వెండి పతకంతో పాటు ప్రశంసా పత్రాలను అందుకుంది. త్వరలో పూనెలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, చిన్నారి ప్రస్తుతం హస్తినాపురంలోని శ్రీభవిష్య పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ నాయకులు

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హరిహరపురం సీనియర్ సిటిజన్ నాయకులు మంగళవారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హరిహరపురం కాలనీ వాసులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అందరూ పోలింగ్ రోజున ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు రావాలని వారు పిలుపునిచ్చారు. ర్యాలీలో రమణ, రఘుపతిరావు, నారాయణ రెడ్డి, రవీంద్రకుమార్, వనజాక్షి, వెంకటయ్య, రంగనాథం, రవీందర్‌రావు, సంజీవరావు, విజయభాస్కర్, రవీందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సంజీవరెడ్డి, కృష్ణ, రాములు, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం



ఆరుట్ల-బండలేమూర్ రోడ్డుపై తెగిపోయిన విద్యుత్ వైర్లు

మంచాల: మంచాల మండలంలోని ఆరుట్లలో గాలివానకు మంగళవారం రాత్రి తాటిచెట్లు కూలి విద్యుత్ సరఫరా వైర్లు తెగిపోయాయి. ఆరుట్ల నుంచి బండలేమూర్ వెళ్లేదారిలో వైర్లు తెగిపోవడంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వడగళ్ల వాన..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. యాచారంలో అరగంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. గునుగల్, మల్కీజ్‌గూడ, గాండ్లగూడెం, మొగుళ్లవంపు, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో వడగళ్లు కురిసాయి. సాయంత్రం వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందినట్లు అయింది.



అందని బిల్లులు.. కార్మికుల వెతలు

- బిల్లులు అందక మధ్యాహ్న భోజన కార్మికుల అవస్థలు
- మెస్ చార్జీలు పెంచాలంటూ నిరసనలు

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు వంట చేసి పట్టినా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక అధికారులకు వినతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోపక్క ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఇచ్చే మెస్‌చార్జీలు సరిపోక నష్టపోతున్నామని కార్మికులు వాపోతున్నారు.

నెలల తరబడి..

మండల పరిధిలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక మోడల్ పాఠశాల, 12 ప్రాథమికోన్నత, 30 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 4300 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడు వేలకు పైగా విద్యార్థులు నిత్యం మధ్యాహ్న భోజనం ఆయా పాఠశాలల్లో తింటున్నారు. కాగా, వారందరికీ 89 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేసి పెడుతున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.8.17 , 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.10.67 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఒకటి నుంచి 8 తరగతులకు కోడిగుడ్ల ఖర్చు అదనంగా చెల్లిస్తుండగా, 9,10 తరగతులకు అందులోనే కలిపి ఇస్తున్నారు. వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేలు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెల గౌరవ వేతనం అందుతుంది. ఎనిమిదో తరగతి వరకు మార్చి, ఏప్రిల్ నెలలు, 9, 10 తరగతులకు జనవరి నుంచి నాలుగు నెలల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. కోడిగుడ్ల బిల్లులు ఆరు నెలలుగా అందాల్సి ఉంది. అలాగే, కేంద్రం, రాష్ట్రం నుంచే వచ్చే రూ.3వేల గౌరవ వేతనం నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క మార్కెట్‌లో నిత్యావసరాలు పెరగడంతో వాటికి అనుగణంగా మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కోడిగుడ్డుకు కేవలం రూ.5 చొప్పున అందిస్తుండగా, మార్కెట్‌లో వాటి ధర రూ.6.50 నుంచి రూ.7 వరకు ఉందని వాపోతున్నారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కోడిగుడ్ల ధరలు పెంచాలని కోరుతున్నారు. త్వరగా పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంతో పాటు మెస్‌చార్జీలు పెంచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

మెస్‌చార్జీలు సరిపోవడం లేదు..



ప్రభుత్వం ఇచ్చే మెస్‌చార్జీలు సరిపోవడం లేదు. మార్కెట్‌లో ధరలు బాగా పెరిగాయి. కోడిగుడ్డుకు రూ.5 చొప్పున ఇస్తున్నారు, మార్కెట్‌లో రూ.6.50కు పైగానే ఉంది. పప్పులు, నూనెల ధరలకు వారిచ్చే బిల్లులకు పొంతన ఉండదు.

– లక్ష్మీబాయి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కార్యదర్శి, నేదునూరు

హామీని నెరవేర్చాలి



సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని నెరవేర్చాలి. ప్రతి నెలా కార్మికులకు బిల్లులు అందిస్తామని వాగ్దానం చేశారు. జీతాలు, మెస్‌చార్జీలు పెంచుతామన్నారు. ఇంకా అమలు చేయలేదు. నెలల తరబడి మెస్‌చార్జీలు, వేతనాలు పెండింగ్‌లో ఉంటే కార్మికులు ఎలా విద్యార్థులకు వంట చేసిపెట్టాలో అధికారులే చెప్పాలి.

– బాల్‌రాజు, సీఐటీయూ మండల కార్యదర్శి, కందుకూరు

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



కందుకూరు:గుమ్మడవెల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ తదితరులు

కందుకూరు: చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఎంపీపీ మంద జ్యోతిపాండు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని గుమ్మడవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం తదితర పథకాలతో పాటు స్వచ్ఛ గ్రామాలుగా మార్చడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకుందని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వమేనన్నారు. మరోసారి మోదీని ప్రధానిని చేయాలంటే ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

10న హక్కుల పరిరక్షణకు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: రాజ్యాంగం, రిజర్వేషన్లు, హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 10వ తేదీన టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు నర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రజాసంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. రిజర్వేషన్లు, మానవ హక్కుల పరిరక్షణ, రాజ్యాంగాన్ని రక్షించుకుని దేశాన్ని కాపాడుకుందామన్నారు. అందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. సమావేశానికి అధిక సంఖ్యలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తిరుపతి, నర్సింహ, కృష్ణ, మల్లేశ్, నర్సింహా, స్వప్న పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలి

- సర్కిల్ –3 ఏఎంహెచ్‌ఓపై చర్యలకు డిమాండ్



బీఎన్‌రెడ్డినగర్‌లో సాగర్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్‌బీనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులపై దాడులు పెరిగాయని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాగర్ కాంప్లెక్స్ వద్ద పాతబస్తీకి చెందిన కొందరు పండ్ల వ్యాపారులు, గంజాయి బ్యాచ్ కలిసి ఎస్టీ యువకుడు సభావత్ రాజునాయక్‌పై దాడి చేయడం వల్ల చావు బతుకుల్లో ఉన్నాడని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సాగర్ కాంప్లెక్స్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సామ రంగారెడ్డి మాట్లాడుతూ, మతోన్మాదులు హిందువులపై దాడులు చేస్తున్నారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సాగర్ కాంప్లెక్స్ వద్ద ఫుట్‌పాత్‌పై అక్రమంగా షెడ్లు వేసుకుని వ్యాపారం చేస్తున్న మైనార్టీలు ఈ దాడి చేశారని ఆరోపించారు. ఎల్‌బీనగర్ సర్కిల్-3 ఏఎంహెచ్‌ఓ లావణ్య నిర్లక్ష్యం వల్లే దాడి జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని అక్కడి నుంచి తొలగించాలని తాను అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లావణ్యపై చర్యలు తీసుకోవాలని ఆయన గ్రేటర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గంట పాటు సాగర్ రహదారిపై బీజేపీ నాయకులు ధర్నాకు దిగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి వచ్చి బీజేపీ నాయకులతో చర్చలు జరపడంతో ధర్నా విరమించారు. పోలీసులు అరగంట పాటు శ్రమించి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు జేసీబీ సహాయంతో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించే వరకూ బీజేపీ నాయకులు అక్కడే ఉన్నారు. ధర్నాలో డివిజన్ అధ్యక్షుడు నవకిశోర్ రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రావు, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విఠల్ రెడ్డి, శరత్‌కుమార్, చపాల్గొన్నారు.

- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ప్రయాణికులు

బీజేపీ నాయకలు ఆకస్మాత్తుగా సాగర్ హైవేపై ధర్నాకు దిగడంతో సుమారుగా 45 నిమిషాల పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.దీంతో కొందరు ప్రయాణికులు వారితో వాగ్వాదానికి దిగారు.

ఇండియా కూటమిదే గెలుపు

- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: దేశంలో మెజార్టీ ఎంపీ స్థానాలు ఇండియా కూటమి, కాంగ్రెస్ గెలుపొంది రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాని కాబోతున్నారని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మల్లేష్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ నేనావత్ ఈశ్వర్‌నాయక్, మన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ అరుణరమేష్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహయాదవ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, మాజీవార్డు సభ్యులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేండ్ల బీజేపీ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ ఓట్లు దండుకుంటుందన్నారు. మతం, బీజేపీని గెలిపిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తారని మండిపడ్డారు. ప్రతి పక్షాలను ఈడీ, సీబీఐ కేసులతో భయభ్రాంతులకు గురి చేసి అక్రమ కేసులు బనాయించి కేసులు పెట్టి జైల్లో వేసి అధికారాన్ని లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. బీజేపీ-బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటే అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బురదలో వేసినట్లే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌సర్సన్ తీగల అనితారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, సీనియర్ నాయకులు మర్యాద రాఘవేందర్‌రెడ్డి, రాజునాయక్, సామ సురేందర్‌రెడ్డి, మర్యాద మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం, గణేష్, రవీందర్‌రెడ్డి, యాదయ్య, రమేష్, రాఘవేందర్‌రెడ్డి, ఈశ్వర్ పలువురు పాల్గొన్నారు.



మహేశ్వరం: రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కందుకూరు: కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కందుకూరు: మండలంలోని జబ్బార్‌గూడ, ధన్నారం, ముచ్చర్ల పెద్దమ్మతండా, గుమ్మడవెల్లితండాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన జబ్బార్‌గూడ మాజీ సర్పంచ్ యాచారం సుగుణమ్మ, పెద్దమ్మ తండా మాజీ ఉప సర్పంచ్ రేఖ్యానాయక్, ధన్నారానికి చెందిన ఉద్యమకారుడు తెలంగాణ శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలను కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని కేఎల్‌ఆర్ వారికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజాప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఖతం చేయాలి



బడంగ్‌పేట్: రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్



హుడాకాంప్లెక్స్: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు అరవింద్, తదితరులు

- మాజీ మంత్రి కేటీఆర్

బడంగ్‌పేట్: ఒక్క ఓటుతోనే బీజేపీ, కాంగ్రెస్‌ను ఖతం చేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్ చౌరస్తా వద్ద కేటీఆర్ రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్‌ధన్ ఖాతా తెరువు.. రూ.15 లక్షలు వేస్తానన్నాడు. వేశాడా ని మోదీని నిలదీశాడు. రైతుల ఆదాయం డబల్ చేస్తానన్నాడు. అయిందాని ప్రశ్నించాడు. దేశంలో అదాని ఆదాయం డబుల్ అయిందే తప్పా రైతులది కాదాన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నాడు. 10 ఏండ్లయింది 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడికి పొయినవి మోదీ అని విమర్శించారు. బుల్లెట్ రైళ్లంటివి ఇంకా బయటకు రావడం లేదాని చమత్కరించారు. హిందూ.. ముస్లింల మధ్య చిచ్చుపెట్టడం తప్పితే మోదీ చేసిందేమి లేదన్నారు. సబితక్క అడగ్గానే కేసీఆర్ మెడికల్ కాలేజీని మంజూరు చేస్తే కొడంగల్‌కు తన్నుకుపోయిన దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మెట్రో, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని సబితక్క అడిగిన వెంటనే కేసీఆర్ రూ.175 కోట్లు మంజూరు చేస్తే నేడు రేవంత్‌రెడ్డి వచ్చి రద్దు చేసిండని చెప్పారు. బ్లాక్‌మేల్ రాజకీయాలు చేస్తూ ప్రజలను ఆరు గ్యారంటీల పేరుతో నిలువునా మోసం చేస్తున్నాడని విరుచుకుపడ్డారు. బీఆర్‌ఎస్‌కు 12 ఎంపీ సీట్లు ఇస్తే మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పుతాడని చెప్పారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆశీర్వదించి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, యువనాయకులు కార్తీక్‌రెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం

హుడాకాంప్లెక్స్: బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల అరవింద్, అంకిరెడ్డిలు మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2లో గడపగడపకూ ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, రేవంత్‌రెడ్డి పాలనలో బస్తీల్లో బతుకులు ఆగమయ్యాయని ఆ రోపించారు. నీళ్లు సరిగ్గా రాక, ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అశోక్, నాయకులు కొండల్‌రెడ్డి, రాజు, అరవింద్, సుదామా, సుశీలరెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలి

కందుకూరు: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని అగర్‌మియాగూడలో మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంతవరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయిందని విమర్శించారు.

స్వార్థంతోనే పార్టీని వీడుతున్నారు..

పహాడీషరీఫ్: బలహీన వర్గాల నేత చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జల్‌పల్లి నాయకుడు గుండు నర్సింగ్ కోరారు. మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ 18వ వార్డులో ఆయన మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి సబితారెడ్డి అండదండలతో ఎదిగి కౌన్సిలర్‌గా గెలుపొందిన స్థానిక కౌన్సిలర్ కంచె లక్ష్మీనారాయణ స్వార్థంతో పార్టీని వీడి కాంగ్రెస్ పంచన చేరారన్నారు. ఇలాంటి వారిని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గౌసుద్దీన్, సాయి, శివ, హన్మంత్, వనజ, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేసింది నేనే..

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



రాజీవ్ గాంధీపార్కులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ఎల్‌బీనగర్‌లో మరింత అభివృద్ధి జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ పార్కులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో తానే అనేక పార్కులను అభివృద్ధి చేశానని తెలిపారు. వాకర్స్‌తో పాటు పచ్చదనం కోసం పార్కులకు వచ్చే వారికి మరింత ఆహ్లాదం పంచడానికి మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఉందన్నారు. నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి, సామ బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు, నాయుడు, రాంబాబు, మల్లేష్‌గౌడ్, చరణ్, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

మన్సూరాబాద్: అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల అధ్యక్షులతో మంగళవారం ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్, హైదరాబాద్ నగరాన్ని కేటీఆర్ అభివృద్ధి చేయగా ఎల్‌బీనగర్ నియోజకవర్గ రూపు రేఖలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మార్చారని అన్నారు. తాను గత 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉండి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని దుయ్యబట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు జగదీష్‌గౌడ్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మన్సూరాబాద్: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బీజేపీ నేత బాతరాజు శంకర్ మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.